## ఇంటర్ ఫస్టియర్ స్పాట్ అడ్మిషన్స్

నస్రుల్లాబాద్, మే 30: మండల కేంద్రంలోని గిరిజన గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు స్పాట్ అడ్మిషన్స్ నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంవత్సరం పదో తరగతి ఉత్తీర్ణులైన గిరిజన విద్యార్థులకు సీఈసీ, హెచ్ఈసీ, ఏ అండ్ టీ ఒకేషనల్ గ్రూపులకు పరిమిత సంఖ్యలో ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు తమ ధ్రువీకరణ పత్రాలు, పదో తరగతి మార్కుల మెమో, టీసీ, బోనాఫైడ్, క్యాస్ట్, ఇన్‌కం, రెసిడెన్షియల్, ఫిజికల్ ఫిట్‌నెస్, ఆధార్ కార్డు, రేషన్ కార్డు రెండు సెట్ల జిరాక్స్ కాపీలతో శుక్రవారం ఉదయం 10 గంటలకు నస్రుల్లాబాద్ గిరిజన గురుకుల కళాశాలలో హాజరు కావాలని ఆయన సూచించారు.

## కొలతల ప్రకారం పనులు చేపట్టాలి

కూలీలకు సూచనలిస్తున్న పంచాయతీ కార్యదర్శి గురునాథ్

బాన్సువాడ రూరల్, మే 30 : కూలీలకు సరైన కూలీ గిట్టుబాటు కావాలంటే ఉపాధిహామీ సిబ్బంది ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేయాలని పులిగుండు తండా గ్రామ పంచాయతీ కార్యదర్శి గురునాథ్ కూలీలకు సూచించారు. గ్రామ శివారులో కొసాగుతున్న ఉపాధిపనులను గురువారం ఆయన పరిశీలించారు. కూలీల హాజరు మస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కూలీలకు పలు సూచనలు చేశారు. జాబ్‌కార్డు ఉన్న కూలీలు మాత్రమే పనులకు రావాలని, లేని వారు కొత్త జాబ్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పని అడిగిన ప్రతి కూలీకి పని కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఆదేశించారు.

## బాధితులకు మొబైల్ ఫోన్ల అందజేత

మాచారెడ్డి, మే 30 : మండలంలోని గజ్యానాయక్‌తండా గ్రామానికి చెందిన ధరావత్ వినోద్, పాల్వంచ మండలం ఇసాయిపేట గ్రామానికి చెందిన మేలక స్వామి తమ మొబైల్ ఫోన్లు పోగొట్టుకోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి ఫోన్లను స్వాధీనం చేసుకొని బాధితులకు గురువారం అందజేసినట్లు ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నవారు వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

## భోజనశాలకు విరాళం

భిక్కనూరు,మే 30: మండల కేంద్రంలోని సిద్ధరామేశ్వర స్వామి ఆలయంలోని భోజనశాలలో ఆరు బెంచీలు, 24 కుర్చీల కోసం ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ పురం రాజమౌళి, రాణి దంపతులు గురువారం విరాళం అందజేశారు. దాతలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో చైర్మన్ మహేందర్ రెడ్డి, నర్సింహారెడ్డి , దయాకర్‌రెడ్డి, సుదర్శన్, జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు.

## గ్రామ దేవతలకు బోనాలు

భిక్కనూరు,మే 30: మండల కేంద్రంలో గ్రామదేవతలకు గురువారం బోనాలు సమర్పించారు. ప్రతి ఇంటి నుంచి అలంకరించిన బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. గ్రామ దేవతలకు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# తాగునీరు అందించండి..

- కాలనీలో సమస్యలు పరిష్కంచండి..
- ఇంద్రానగర్, రాజీవ్‌నగర్‌వాసుల ఆందోళన

ఆందోళన చేస్తున్న కాలనీవాసులు

కామారెడ్డి, మే 30 : తాగునీరందించి, కాలనీలోని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పట్టణంలోని 22వ వార్డు పరిధి ఇంద్రానగర్, రాజీవ్‌నగర్ కాలనీవాసులు గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇంద్రానగర్, రాజీవ్‌నగర్ కాలనీలో 300 డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఉన్నాయని, తాగునీరు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. వీధి దీపాలు కూడా సరిగ్గాలేవన్నారు. మొత్తం 25 బ్లాక్స్ ఉంటే కొన్ని బ్లాక్స్‌ల్లో మాత్రమే విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారని తెలిపారు. మురికి కాలువ పైపులైన్ సరిగ్గా లేక దుర్వాసన వెదజల్లుతున్నదని, దీంతో దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నామని వాపోయారు. విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో రాత్రివేళ పాములు కూడా వస్తున్నాయన్నారు. రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి తలుపులు కొడుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. కలెక్టర్ వెంటనే స్పందించి తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు.

## తాగునీటి సమస్య లేకుండా చూడాలి

- ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలి
- ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

మున్సిపల్ వాటర్ వర్క్స్ కార్యాలయం వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కామారెడ్డి, మే 30: కామారెడ్డి మున్సిపల్ పరిధిలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని, నీటి సమస్య ఉన్న కాలనీలకు ట్యాంకర్ల ద్వారా నీటిని ఉచితంగా సరఫరా చేయాలని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. గురువారం ఆయన జిల్లా ప్రభుత్వ దవాఖాన, మున్సిపల్ వాటర్ వర్క్స్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. దవాఖానలో రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. అనంతరం మున్సిపల్ వాటర్ వర్క్స్ కార్యాలయానికి వెళ్లి అధికారులు, మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడారు. పట్టణంలో ఎక్కడా కూడా తాగునీటి సమస్య రావొద్దన్నారు. తాగునీటి సమస్య ఉంటే వాటర్ ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేయాలని సూచించారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ

బీబీపేట్, మే 30: మండలంలోని కోనాపూర్, శివారు రాంరెడ్డిపల్లి, యాడారం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కోనుగోళ్ల కేంద్రాలను అదనపు కలెక్టర్ చంద్రమోహన్‌రెడ్డి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో పూర్తయిన ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి హమాలీలను.. ఇంకా పూర్తికాని ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించాలని అధికారులకు సూచించారు. రెండు మూడు రోజుల్లో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ వెంట జిల్లా పౌర సరఫరా అధికారులు, డిప్యూటీ తహసీల్దార్ శృతి, ఆర్ అజయ్‌కుమార్, అధికారులు, సొసైటీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

కోనాపూర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ చంద్రమోహన్‌రెడ్డి

## విద్యుత్ షాక్‌తో గేదెలు మృతి

మాచారెడ్డి/ కామారెడ్డి, మే 30 : పాల్వంచ, కామారెడ్డి మున్సిపల్ పరిధిలో విద్యుత్ షాక్‌తో రెండు గేదెలు మృతి చెందాయి. ఈ రెండు ఘటనలు గురువారం చోటుచేసుకున్నాయి. పాల్వంచ మండలంలోని వాడి గ్రామంలో నిమ్మల్ల సత్తవ్వకు చెందిన గేదె చేనులో మేత మేస్తుండగా విద్యుత్ తీగ మీదపడడంతో అక్కడికక్కడే మృతిచెందినట్లు బాధితురాలు తెలిపింది. తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరింది. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని అడ్లూర్‌లోని ఒకటో వార్డులో ప్రకృతి వనంలో కృష్ణంరాజుకు చెందిన గేదె విద్యుత్‌షాక్‌తో మృతి చెందింది. లైన్‌మన్ మాన్‌సింగ్ నిర్లక్ష్యంతోనే తన గేదె మృతి చెందినట్లు యజమాని ఆరోపించారు. మృతి చెందిన గేదె విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని తెలిపారు.

# జీలుగ విత్తనాల పంపిణీ

బీబీపేట్, మే 30: మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయ ఆవరణలో గురువారం జీలుగ విత్తనాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు.విత్తనాల కోసం మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల నుంచి రైతులు తరలివచ్చి క్యూలో నిల్చున్నారు. ఈ సందర్భంగా ఏఈవోలు మాట్లాడుతూ.. మండలంలో ఇప్పటి వరకు 300 బస్తాల జీలుగ విత్తనాలను రైతులకు అందజేసినట్లు తెలిపారు.

బీబీపేట్‌లో విత్తనాల కోసం క్యూలో ఉన్న రైతులు

**కామారెడ్డి రూరల్ మండలంలో..**

కామారెడ్డి రూరల్ , మే 30: మండలంలోని చిన్నమల్లారెడ్డి, ఇస్రోజివాడి, శాబ్దిపూర్, క్యాసంపల్లిలో రైతులకు గురువారం జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కామారెడ్డి ఏడీఏ అపర్ణ మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. చిన్నమల్లారెడ్డి విండోకు 432, గర్గుల్‌కు 400 మొత్తం 832 బస్తాలు వచ్చినట్లు చెప్పారు. మొత్తం 438 మంది రైతులకు 572 బ్యాగుల విత్తనాలను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎస్ . శ్రీనివాసరావు, ఏఈవోలు అశోక్ రెడ్డి, రాణి, బాలకిషన్, తేజస్విని పాల్గొన్నారు.

## జాతీయస్థాయిలో కొండాపూర్ విద్యార్థుల ప్రతిభ

రాజంపేట్, మే 30: మండలంలోని కొండాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టులు జాతీయ స్థాయి అటల్ మారథాన్ -2022-23 పోటీలకు ఎంపికయ్యాయి.పాఠశాలలోని సీపీ రామన్ గ్రూప్ తయారు చేసిన ' ఎ డైనమిక్ టాయ్ దట్ ప్రొటెక్ట్స్ గ్రేన్ ఫ్రమ్ రాయ్), స్వచ్ఛభారత్ గ్రూప్ తయారు చేసిన 'మ్యాథమెటికల్ మోడల్ ఫర్ స్వచ్ఛ భారత్' అనే ప్రాజెక్టులు ఎంపికవగా.. విద్యార్థులను, హెచ్ఎంను డీఈవో రాజు అభినందించారు.

## తడి, పొడి చెత్తను వేరుగా సేకరించాలి

కామారెడ్డి రూరల్ , మే 30: కామారెడ్డి మండలంలో శాబ్దిపూర్, గూడెం గ్రామాల్లో ఎంపీవో మలహరి గురువారం పర్యటించారు. నర్సరీ, వైకుంఠధామం, కంపోస్ట్ షెడ్డు, పల్లె ప్రకృతివనాన్ని పరిశీలించారు. ప్రతి ఇంటి నుంచి తడిపొడి చెత్తను సేకరించి ఎరువులను తయారు చేయాలని సూచించారు. నర్సరీలోని మొక్కలను సంరక్షించాలన్నారు. హరితహారం కార్యక్రమానికి మొక్కలను సిద్ధంగా ఉంచాలని సూచించారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

బిచ్కుంద, మే 30: ఫర్టిలైజర్ దుకాణాల్లో నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని ఏడీఏ వీరస్వామి, బిచ్కుంద ఎస్సై మోహన్‌రెడ్డి హెచ్చరించారు. మండల కేంద్రంలోని పలు దుకాణాలను ఏవో రాజలింగంతో కలిసి గురువారం తనిఖీ చేశారు. దుకాణాల్లోని ఎరువులు, విత్తనాల బస్తాలను పరిశీలించారు. ఇతర రాష్ట్రాల నుంచి తీసుకువచ్చిన విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్టు కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బాన్సువాడ ఏవో సుధాకర్, బిచ్కుంద ఏఎస్సై శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

### ఎల్లారెడ్డి ప్రభుత్వ దవాఖానలో

# అసాంఘిక కార్యకలాపాలపై డీసీహెచ్ఎస్ విచారణ

- సానిటేషన్ సూపర్‌వైజర్ తొలగింపు
- బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

ఎల్లారెడ్డి ప్రభుత్వ దవాఖానలో పనిచేస్తున్న నర్సులు, సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకుంటున్న డీసీహెచ్ఎస్ విజయలక్ష్మి

ఎల్లారెడ్డి రూరల్, మే 30: అధికారాన్ని అడ్డుపెట్టుకొని స్థానిక కాంగ్రెస్ నాయకులు ఎల్లారెడ్డి ప్రభుత్వ దవాఖానలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నరనే ఆరోపణలపై డీసీహెచ్ఎస్ విజయలక్ష్మి విచారణ చేపట్టారు. గురువారం ఎల్లారెడ్డి ప్రభుత్వ దవాఖానను సందర్శించిన ఆమె వివరాలు సేకరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. సానిటేషన్ కాంట్రాక్టర్ గణేశ్ వద్ద సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న సాయిబాబాను విధుల నుంచి తొలగిస్తున్నామని తెలిపారు. సాయిబాబా అజమాయిషీలో 14మంది పని చేస్తారని చెప్పారు. వారిలో కొంత మందితో కాంగ్రెస్ నాయకుల సొంతపనులు చేయిస్తున్నారని, కాంగ్రెస్ నేతల అండదండలతో దవాఖానలో ఇష్టారాజ్యంగా ప్రవరిస్తున్నాడని విచారణలో తేలిందన్నారు. దీంతో ఆయనను విధుల నుంచి వెంటనే తొలగించినట్లు డీసీహెచ్ఎస్ విజయలక్ష్మి తెలిపారు. దవాఖానలో అసాంఘిక కార్యకలాపాలు జరిగాయని ఫిర్యాదు వచ్చిందని, ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు వసూలు చేసిన విషయంపై విచారణ చేపట్టి కలెక్టర్‌కు నివేదికను అందజేస్తామని తెలిపారు. ఎన్నికల కోడ్ ఉన్న సమయంలో దవాఖానలో కాంగ్రెస్ నాయకులు సమావేశం నిర్వహించడం నిబంధనలకు విరుద్ధమని ఆమె స్పష్టంచేశారు. ఆరోపణలు వచ్చిన అన్ని విషయాలపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు. దవాఖానలో జరుగుతున్న విషయాలపై బీఆర్ఎస్, బీజేపీ నాయకులు డీసీహెచ్ఎస్ విజయలక్ష్మికి ఫిర్యాదు చేశారు.

డీసీహెచ్ఎస్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అనంతరం ఆమె దవాఖానలోని వార్డులను సందర్శించారు. పలువురు రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలను తెలుసుకున్నారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు ఇబ్బందులకు గురిచేసిన సిబ్బందితో డీసీహెచ్ఎస్ మాట్లాడారు. ఆమెవెంట దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రవీంద్రమోహన్, డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ బెజుగం సంగీత్, దవాఖాన సిబ్బంది ఉన్నారు.

## పోడు సమస్యలను పరిష్కరిస్తా..

### జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

బేగంపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

పెద్దకొడప్‌గల్, మే 30: పోడు భూముల సమస్యలను పరిష్కరిస్తానని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. మండలంలోని బేగంపూర్, అంజని, చావుని తండా, తలాబ్‌తండా, శివాపూర్ గ్రామాలను ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. తండాల్లో పోడు భూముల సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ప్రతి తండాను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఆయనవెంట నాయకులు మహేందర్‌రెడ్డి, నాగిరెడ్డి, హైమద్, మల్లప్ప పటేల్, మోహన్ తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేసిన ఎంపీవో

వివరాలు తెలుసుకుంటున్న ఎంపీవో రాజ్‌కిరణ్‌రెడ్డి

గాంధారి, మే 30: మండలంలోని సీతాయిపల్లి ప్రభుత్వ పాఠశాలను ఎంపీవో రాజ్‌కిరణ్‌రెడ్డి గురువారం పరిశీలించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలు, సమకూర్చాల్సిన మౌలిక వసతులను తెలుసుకున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా పాఠశాలలో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి భరద్వాజ్, ఐకేపీ సీసీ రాజయ్య, వీవోఏ గౌస్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## అందుబాటులో జీలుగ విత్తనాలు

ఎల్లారెడ్డి రూరల్, మే 30: మండలంలోని మత్తమాల సొసైటీలో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ విస్తీర్ణాధికారి రవీందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 30కిలోల జీలుగ బస్తా 60 శాతం సబ్సిడీపై 1,116 రూపాయలకు రైతులకు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. అవసరం ఉన్న రైతులు తమ పట్టాపాస్‌బుక్, ఆధాక్ కార్డు జిరాక్స్‌లను తీసుకువచ్చి మత్తమాల సొసైటీలో పర్మిట్ తీసుకొని విత్తనాలను తీసుకెళ్లాలని సూచించారు.

## బాల్‌కిషన్‌గుప్తాకు మద్దతు తెలపాలి

ఎల్లారెడ్డి, మే 30: జూన్ 9వ తేదీన జరుగనున్న జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష ఎన్నికల్లో ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి కంచర్ల బాల్‌కిషన్ గుప్తాకు మద్దతు ప్రకటించాలని ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు ముత్యపు సుదర్శన్ కోరారు. బుధవారం రాత్రి ఎల్లారెడ్డి పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వరుసక్రమంలో ఈసారి ఎల్లారెడ్డి రెవెన్యూ డివిజన్‌కు జిల్లా అధ్యక్ష పదవి అవకాశం వచ్చిందని, బాల్‌కిషన్ గుప్తాను జిల్లా అధ్యక్ష పదవికి అభ్యర్థిగా నిర్ణయించినందున ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట, లింగంపేట, గాంధారి మండలాల ఆర్యవైశ్యలందరూ ఏకగ్రీవ మద్దతు తెలిపాలని కోరారు.

## విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని వినతి

ట్రాన్స్‌కో ఎస్ఈని సన్మానిస్తున్న నాయకులు

రామారెడ్డి, మే 30: ఉమ్మడి సదాశివనగర్ మండలంలో విద్యుత్ సమస్యలు వానకాలం ప్రారంభానికి ముందుగానే పరిష్కరించాలని మాజీ జడ్పీటీసీ రాజేశ్వర్‌రావు.. ట్రాన్స్‌కో ఎస్ఈ రమేశ్‌బాబును కోరారు. ఈ మేరకు ఆయనను గురువారం కలిసి సన్మానించి సమస్యలను విన్నవించారు. ఈదురు గాలులు, వర్షానికి విద్యుత్ వైర్లు, స్తంభాలు దెబ్బతినే ప్రమాదం ఉన్న వాటిని గుర్తించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. రామారెడ్డి మండలంలోని మోషంపూర్‌లో నాలుగు రోజులుగా ఎస్, ఎస్-2 ట్రాన్స్‌ఫార్మర్ పనిచేయకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని ఎస్ఈని కోరారు. ఆయనతోపాటు మోషంపూర్ దత్తు ఉన్నారు.

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

రామారెడ్డి, మే 30: మండల కేంద్రానికి చెందిన ప్రసాద్ తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. ఈ విషయమై స్థానిక పోలీసులకు 3-10-2023న ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి సెల్‌ఫోన్ ఆచూకీ కనుగొన్నారు. దానిని బాధితుడికి ఎస్సై విజయ్ గురువారం అందజేశారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## 3,250 మంది కూలీలతో ఉపాధి పనులు

నాగిరెడ్డిపేట, మే 30: మండలంలోని 25 గ్రామ పంచాయతీల పరిధిలో 3,250 మంది కూలీలతో ఉపాధి హామీ పథకం పనులు చేపడుతున్నట్లు ఏపీవో సాయిలు గురువారం తెలిపారు. గ్రామాల శివారు ప్రాంతాల్లో ఉన్న ఊర చెరువుల్లో పూడికతీత పనులు చేపడుతున్నారని అన్నారు. తీసిన మట్టిని రైతుల పంట పొలాలు, రోడ్ల నిర్మాణం కోసం వినియోగిస్తున్నట్లు తెలిపారు. పనులను నిబంధనల ప్రకారం చేపట్టాలని కూలీలకు సూచిస్తున్నామని అన్నారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

డాక్యుమెంట్స్ పోయినవి

★నా పేరు సామల చంద్రకళ భర్త నారాయణ రెడ్డి ఇనెం.3-66 గ్రామము శంతాపూర్ నా యొక్క స్థిరాస్తి డాక్యుమెంట్స్ నెం.2247/2014కు సంబంధించిన సర్వే నం.513/1, 513/2 బిచ్కుంద బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్నప్పుడు నా బ్యాగు గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. కావున ఎవరికైన దొరికినచో నెంబర్ కు సెల్: 80089 51075.
NTZ-324695

శుభవార్త

★నిరుద్యోగ యువతి, యువకులకు జీవితంలో ఆర్థికంగా స్థిరపడే గొప్ప వ్యాపార అవకాశం కలదు. ఆసక్తి గల వారు వెంటనే సంప్రదించండి: సెల్: 9059962194.
NTK-311380

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన 4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## 'ముదిరాజ్‌లను బీసీ-ఏలోకి మార్చాలి'

ఎల్లారెడ్డి రూరల్, మే 30: కాంగ్రెస్ పార్టీ ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీ మేరకు బీసీ డీ నుంచి ఏకు మార్చాలని, జీవో ఎంఎస్ 15ను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు భట్టు విఠల్ ముదిరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డిలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన సొసైటీల ఏర్పాట్లలో ఇబ్బందులపై గత నెల రాష్ట్ర హైకోర్టు ముదిరాజ్‌లకు అనుకూలంగా తీర్పునివ్వడంపై ఆయన హర్షం వ్యక్తంచేశారు. ప్రభుత్వం అధికారికంగా నిపుణులతో కమిటీని ఏర్పాటుచేసి హైకోర్టుకు అందజేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, ఏమాత్రం నిర్లక్ష్యం ప్రదర్శించినా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, సొసైటీ చైర్మన్ ఏగుల నర్సింహులు, ముదిరాజ్ మహాసభ ఎల్లారెడ్డి నాయకులు ప్యాలాల రాములు, మర్రి బాల్‌కిషన్, సంతోష్, మర్రి ప్రకాశ్, సాయిరాం, ఎల్లయ్య, పోచయ్య, అశోక్, జక్కుల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## ప్యాకింగ్‌లేని విత్తనాలు కొనుగోలు చేయొద్దు

గాంధారి, మే 30: పంటలు సాగు చేసే రైతులు ప్యాకింగ్‌లేని విత్తనాలను కొనుగోలు చేయకూడదని గాంధారి మండల వ్యవసాయాధికారి నరేశ్ అన్నారు. మండలంలోని వండ్రికల్, కరక్‌వాడి, చద్మల్, గౌరారం గ్రామాల్లోని రైతువేదిక భవనాల్లో వానకాలం పంటల సాగుపై రైతులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ.. విత్తనాలను కొనుగోలు చేసినప్పుడు సంబంధించిన బిల్లులను తప్పకుండా తీసుకోవాలని రైతులకు సూచించారు. లైసెన్సు ఉన్న దుకాణాల్లోనే విత్తనాలను కొనుగోలు చేయాలని, వర్షాలు సమృద్ధిగా కురిసిన అనంతరం విత్తుకోవాలన్నారు. అనంతరం మండల కేంద్రంలోని విత్తన, పురుగుమందుల దుకాణాలను ఏవో తనిఖీ చేశారు. స్టాక్, విక్రయించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ-పాస్ విధానంలోనే ఎరువులను విక్రయించాలని సూచించారు. ఆయనవెంట ఏఈవోలు విజ్ఞేశ్, కరుణేశ్వర్, దీక్షిత్, ఆరతి, రైతులు ఉన్నారు.

డోంగ్లీలో అవగాహన కల్పిస్తున్న ఏఈవో గజానంద్ పాటిల్

**బిల్లు తప్పకుండా తీసుకోవాలి..**

డోంగ్లీ, మే 30: విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు.. డీలర్ల వద్ద తప్పకుండా బిల్లులు తీసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. డోంగ్లీలో పలువురు రైతులకు ఏఈవో గజానంద్ పాటిల్ వానకాలం పంటల సాగుపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ అనుమతి ఉన్న దుకాణాల నుంచి ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. పంట చేతికి వచ్చే వరకు బిల్లులను జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని సూచించారు.